క్లుప్తంగా

ఎన్‌ఎంఆర్ సిబ్బందికి రెగ్యులర్ పోస్టింగ్

నెల్లూరు(బారకాసు) : నెల్లూరు నగరపాలక సంస్థలో టైమ్ స్కేల్ ఎన్‌ఎంఆర్‌లుగా విధులు నిర్వహిస్తున్న ఐదుగురు సిబ్బందికి రెగ్యులర్ పోస్టింగ్ హోదా కల్పిస్తూ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖ ఉత్తర్వులను జారీ చేసింది. దీని ప్రకారం ఎన్‌ఎంసీలో విధులు నిర్వహిస్తున్న మహ్మద్ జంషీద్‌అహ్మద్, వేణుగోపాలరావు, సుధాకర్‌రెడ్డి, ఎం.అజంత, గౌస్‌బాషాలకు ఇంజినీరింగ్ విభాగంలో రెగ్యులర్ పోస్టింగ్‌లు ఇస్తూ కమిషనర్ సూర్యతేజ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

టౌన్‌ప్లానింగ్ విభాగంలో మార్పులు

నెల్లూరు(బారకాసు) : నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ పట్టణ ప్రణాళికా విభాగంలో పలు మార్పులు చేస్తూ కమిషనర్ సూర్యతేజ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో భాగంగా అసిస్టెంట్ సిటీ ప్లానర్‌గా ఉన్న వి.వేణుకు రూరల్ నియోజకవర్గ టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్(టీపీఓ) ఇన్‌చార్జిగా బాధ్యతలు కల్పించారు. అలాగే టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్‌గా చేస్తున్న ప్రకాష్‌బాబుకు అర్బన్ నియోజకవర్గ అసిస్టెంట్ సిటీ ప్లానర్(ఏసీపీ)గా అదనపు బాధ్యతలు కల్పించారు.

పీహెచ్‌సీలో తనిఖీ



బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : మండలంలోని జొన్నవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ కంట్రోల్ అధికారి డాక్టర్ ఖాదర్‌వలీ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా టీబీ నిర్ధారణ పరీక్షల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. వైద్యాధికారులు డాక్టర్ సయ్యద్ అహ్మద్‌బాబు, డాక్టర్ కె.అవంతి, ల్యాబ్ టెక్నీషియన్ యాసిన్ అహ్మద్ పాల్గొన్నారు.

కనులపండువగా పల్లకిసేవ



పొదలకూరు: పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్లో గల లక్ష్మీ గోదా సమేత వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో పల్లకిసేవను వేడుకగా శనివారం నిర్వహించారు. స్వామి, అమ్మవారు విశేషాలంకారంలో దర్శనమిచ్చారు. అభిషేకాలు, పూజలు చేశారు.

తాటాకులదిన్నెలో సామూహిక సీమంతాలు



కొడవలూరు : మండలంలోని తాటాకులదిన్నె అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు శనివారం సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వి.పద్మావతి మాట్లాడుతూ గర్భిణులు తీసుకోవాల్సిన ఆహారం, వెయ్యి రోజుల ఆరోగ్య పరిరక్షణ గురించి తెలియజేశారు. పౌష్టికాహార ఆవశ్యకత గురించి వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారాన్ని తప్పక తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మస్తాన్‌వలీ, రామకృష్ణ, అంగన్‌వాడీ కార్యకర్త జి.అరుణ, ఎంఎల్‌హెచ్‌పీ జి.సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

వెంకయ్యస్వామికి విశేష పూజలు

మనుబోలు: మండల పరిధిలోని బీసీ కాలనీ సమీపంలో గల వెంకయ్యస్వామి మందిరంలో విశేష పూజలను శనివారం నిర్వహించారు. పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలను అర్చకుడు శ్రీనివాసులు ఆధ్వర్యంలో జరిపారు. అన్నప్రసాదాన్ని మధ్యాహ్నం అందజేశారు. ఉభయకర్తలుగా చెరుకుమూడి అంకయ్య, గురుప్రసన్న దంపతులు వ్యవహరించారు.

విడవలూరులో జాబ్ మేళా

విడవలూరు : స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం జాబ్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ తిరుపతి, రేణిగుంట, తడ నుంచి వివిధ కంపెనీల హెచ్‌ఆర్‌లు విచ్చేసి మండలంలోని నిరుద్యోగ యువతకు ఇంటర్వ్యూలు చేశారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నగేష్‌కుమారి, స్థానిక నేతలు చెముకుల శ్రీనివాసులు, పాశం శ్రీహరిరెడ్డి, సత్యవోలు సత్యంరెడ్డి, చెముకుల కృష్ణచైతన్య పాల్గొన్నారు.

ఆటో.. అటో ఎటో

- నిబంధనలు ఖాతరు చేయని ఆటోవాలాలు
- ఎక్కడపడితే అక్కడ స్టాండ్లు
- తీవ్రమవుతున్న ట్రాఫిక్ సమస్య
- ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న వైనం



కేవీఆర్ పెట్రోల్ బంకు వద్ద నో పార్కింగ్ బోర్డు వద్దనే నిలిచి ఉన్న ఆటోలు

నెల్లూరు(క్రైమ్) : నిబంధనలకు తూట్లు పొడుస్తూ ఆటోవాలాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుండడంతో ట్రాఫిక్ సమస్య జఠిలంగా మారుతోంది. నగరవాసులు ఎదుర్కొంటున్న సమస్యల్లో ప్రధానమైనది ట్రాఫిక్. పెరుగుతున్న నగర విస్తీర్ణం, వాహనాలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నగరంలో రాకపోకలు సాగించాలంటేనే పట్టపగలే చుక్కలు కనిపిస్తున్నాయి. ట్రాఫిక్ సమస్యకు ఆటోలూ కారణాలుగా నిలుస్తున్నాయి. నెల్లూరు నగరంలో సుమారు 25 వేలకు పైగా ఆటోలు ఉండగా ఇతర ప్రాంతాల నుంచి నిత్యం వందల సంఖ్యలో నెల్లూరు నగరానికి రాకపోకలు సాగిస్తున్నాయి. ఆటో డ్రైవర్లు అధిక శాతం ట్రాఫిక్ నిబంధనలను బేఖాతర్ చేస్తున్నారు. మితిమీరిన వేగం, పరిమితికి మించిన ప్రయాణం, మైనర్లు సైతం ఆటోలు నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారు.

రోడ్లపై ఇష్టానుసారంగా..

ఆటో డ్రైవర్లలో అనేక మందికి ట్రాఫిక్ నిబంధనలపై సరైన అవగాహన లేదు. దీంతో వారు ఇష్టానుసారం రాకపోకలు సాగిస్తున్నారు. ప్రధాన కూడళ్లు, జనసామర్థ్యం అధికంగా ఉండే ప్రాంతాల్లో నడిరోడ్లపైనే ఆటోలను నిలుపుతున్నారు. ప్రధానంగా ఆర్టీసీ బస్టాండ్, ఆత్మకూరు బస్టాండ్‌ల వద్ద ఆటోలు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగిస్తున్నాయి. రోడ్లపై అడ్డంగా ఆటోలు నిలుపుతుండటంతో బస్టాండ్ లోపల నుంచి బస్సులు బయటకు వచ్చేందుకూ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. బస్సులకు అడ్డంగా ఆటోలను నిలిపి ప్రయాణికులను ఎక్కించుకుంటుండటంతో ట్రాఫిక్‌కు అంతరాయం వాటిల్లుతోంది.

అనధికార స్టాండ్లు

నగరంలోని ప్రధాన కూడళ్లలో జాగా కనిపిస్తే ఆటోవాలాలు పాగావేసి ఆటోస్టాండ్లుగా మార్చేస్తున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఆర్టీసీ, ఫత్తేఖాన్‌పేట, వీఆర్సీ, ముత్తుకూరు బస్టాండు, గాంధీబొమ్మ, సండే మార్కెట్, ఆత్మకూరు బస్టాండు, స్టోన్‌హౌస్‌పేట, ప్రధాన రైల్వేస్టేషన్, హరనాథపురం తదితర ప్రాంతాల్లో ఆటోస్టాండ్లు ఏర్పడ్డాయి. గంటల తరబడి రోడ్లపైనే వాహనాలను నిలుపుతూ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్నారు. తాజాగా కేవీఆర్ పెట్రోల్ బంకు జంక్షన్‌కు ఇరువైపులా నూతనంగా ఆటోస్టాండ్లను ఏర్పాటు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే బస్సులకు కేవీఆర్ పెట్రోల్ బంకు వద్ద నిలుపుతున్నారు. దీంతో బస్సులకు అడ్డంగా ఆటోలను నిలిపి ప్రయాణికులను ఎక్కించుకునేందుకు పోటీపడుతున్నారు. ఫలితంగా వెనుక వచ్చే వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

గతంలో ఇలా..

ట్రాఫిక్ క్రమబద్ధీకరణ చర్యల్లో భాగంగా గతంలో నగరంలోకి ఇతర ప్రాంతాల ఆటోల రాకపోకలపై అధికారులు ఆంక్షలు విధించారు. బుచ్చిరెడ్డిపాళెం, కోవూరు వైపు నుంచి, మైపాడువైపు నుంచి వచ్చే వాహనాలు పీబీసాత్ వరకు, కోడూరువైపు నుంచి వచ్చే వాహనాలు నవాబుపేట వరకు, ముత్తుకూరు వైపు నుంచి వచ్చే వాహనాలు హరనాథపురం వరకు, గూడూరు వైపు నుంచి వచ్చే వాహనాలు అయ్యప్పగుడి వరకు, కొత్తూరు వైపు నుంచి వచ్చే వాహనాలు డైకస్ రోడ్డు వరకు సరిహద్దులుగా నిర్ణయించారు. ఆటోలకు నంబర్లు కేటాయించారు. దీంతో నగరంలోని వాహనాలు మాత్రమే ఇక్కడ తిరిగేవి. ఇతర వాహనాలు నగరంలోకి వచ్చేవి కావు. ఆటోస్టాండ్లపైనా నియంత్రణ ఉండేది. అయితే ఇప్పుడు ఆటోల నియంత్రణకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ట్రాఫిక్ నిబంధనలపై ఆటోడ్రైవర్లకు అవగాహన కల్పించడంతో పాటు, ఆటోలను నియంత్రించాల్సిన అవసరం ఉందని నగర వాసులు కోరుతున్నారు.



బస్సులకు అడ్డంగా నిలిపిన ఆటోలు



అడ్డదిడ్డంగా తిరుగుతున్న ఆటోలు

నెల్లూరీయులకు అవార్డులు

నెల్లూరు(బృందావనం) : ఉభయ తెలుగు రాష్ట్రాల పరిధిలో నిర్వహించిన షార్ట్‌ఫిల్మ్ కాంపిటీషన్‌లో తాము తీసిన 'షీ' ద పవర్ షార్ట్‌ఫిల్మ్‌కు ఉత్తమ జ్యూరీ అవార్డు, బెస్ట్ మ్యూజిక్ డైరెక్టర్ అవార్డు లభించాయని దర్శకుడు కళాంజలి అనంత్ శనివారం తెలిపారు. హైదరాబాద్‌లో జరిగిన టైగర్ అవార్డ్స్ 2024లో తాను కథ, మాటలు, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం వహించిన 'షీ' షార్ట్‌ఫిల్మ్ ఉత్తమ జ్యూరీ అవార్డును పొందిందన్నారు. అలాగే బెస్ట్‌మ్యూజిక్ డైరెక్టర్ సురభి సంగీత సౌరభ్‌కు అవార్డు వచ్చిందన్నారు. ఈ షార్ట్ ఫిల్మ్‌లో రామచంద్రమూర్తి, దువ్వూరి బెనర్జీ, మౌనిక, ఉపేంద్ర, శివకుమార్, హజరత్ నటించగా కెమెరా మెన్‌గా క్రిస్టోఫర్ వ్యవహరించారని తెలిపారు.

ఇరిగేషన్ ఉద్యోగ సంఘ ప్రతినిధుల ఎన్నిక

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : ఏపీఎన్జీఓ అసోసియేషన్ ఇరిగేషన్ సర్కిల్ యూనిట్‌లో ఖాళీ అయిన ప్రతినిధుల ఎన్నిక శనివారం జరిగింది. అసోసియేషన్ ఇరిగేషన్ సర్కిల్ యూనిట్ అధ్యక్షుడు విజయకుమార్ ఆధ్వర్యంలో జనరల్ బాడీ సమావేశం ఇరిగేషన్ కార్యాలయ ప్రాంగణంలో జరిగింది. తొలుత మాజీ కార్యదర్శి గోపాల్‌ను సత్కరించారు. నూతన కార్యదర్శిగా పి.రామచంద్రయ్య, ట్రెజరర్‌గా ఎస్.సుబ్బరామయ్య, ఉపాధ్యక్షుడిగా కె.ప్రసాద్ (జేటీఓ), అసోసియేట్ ప్రెసిడెంట్‌గా వీవీ శివప్రసాద్, సంయుక్త కార్యదర్శిగా ఎస్.విజయభారతిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు పి.రవికుమార్, రాష్ట్ర మహిళ ఉపాధ్యక్షురాలు స్వర్ణలత, సర్కిల్ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వంతో ఇరుపక్షాలకు ప్రయోజనం



మాట్లాడుతున్న కె.వాణి

నెల్లూరు (లీగల్) : కోర్టు కేసులకు సంబంధించి మధ్యవర్తిత్వం ద్వారా ఇరుపక్షాలకు ప్రయోజనం చేకూరుతుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.వాణి అన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నెల్లూరు బార్ అసోసియేషన్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన మధ్యవర్తిత్వ సమావేశంలో ఆమె పాల్గొని, మాట్లాడారు. శిక్షణ పొందిన న్యాయవాదుల సమక్షంలో కేసులకు సంబంధించిన ఉభయపక్షాల నడుమ చర్చలు జరుగుతాయని, దీని ద్వారా న్యాయవాది ఒక రిపోర్టును ఫైల్ చేస్తారన్నారు. దీనిని నాయమూర్తి పరిశీలించి తుది తీర్పును ఇస్తారన్నారు. సమావేశంలో ఏపీ బార్ కౌన్సిల్ సభ్యుడు వేనాటి చంద్రశేఖర్‌రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఉమామహేశ్వర్‌రెడ్డి, సుందరయ్య యాదవ్, చీఫ్ డిఫెన్స్ కౌన్సిల్ టంగుటూరు గోపాల్‌రెడ్డి, శిక్షణ పొందిన న్యాయవాదులు వీవీ కోటేశ్వరరావు, లక్ష్మి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

10న ఐక్య సింహపురి క్రిస్మస్ మహోత్సవం



వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

నెల్లూరు(బృందావనం) : ఈనెల 10న నగరంలోని వీఆర్సీ మైదానంలో 13వ ఐక్య సింహపురి క్రిస్మస్ మహోత్సవం-2024ను ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు, కన్వీనర్ ఎం.బర్నబాస్ తెలిపారు. అందుకు సంబంధించిన వాల్‌పోస్టర్లు, ఆహ్వాన పత్రికలను సంఘ నాయకులతో కలిసి శనివారం వీఆర్సీ మైదానంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బర్నబాస్ మాట్లాడుతూ అంతర్జాతీయ సువార్తికుడు బ్రదర్ అనిల్‌కుమార్ ముఖ్య ప్రసంగీకులుగా వ్యవహరించనున్నారన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా 'జాయ్‌బెల్స్' బ్యాండ్ వారిచే లైవ్ వర్షిప్ నైట్ కేక్ కటింగ్, క్యాండిల్ సర్వీస్, క్రిస్మస్ ట్రీ ఇనాగిరేషన్, దైవ సందేశాలు తదితర కార్యక్రమాలు జరుగుతాయన్నారు. సమావేశంలో క్రైస్తవ సంఘీయులు, పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నేతలు ఉరందూరు సురేంద్రబాబు, గడ్డం హనోక్, క్రాంతి, దాసు, రాఘవమోసెస్, ఎల్ఎం. విజయకుమార్, బాబు, జోనా, శ్యామ్, భాస్కర్, కిరణ్, నాని తదితరులు పాల్గొన్నారు.

ప్రజల వద్దకే దంత వైద్యసేవలు



ఉచిత సంచార వాహనాన్ని ప్రారంభిస్తున్న జీఎం విజయభాస్కర్‌రెడ్డి

నెల్లూరు(అర్బన్) : ప్రజలకు దంత వ్యాధులపై అవగాహన కల్పించడంతో పాటు ఉచిత దంత వైద్యసేవలందించేందుకు 'ప్రజల చెంతకు నారాయణ దంత వైద్యసేవలు' అనే కార్యక్రమాన్ని చేపట్టామని నారాయణ విద్యాసంస్థల జనరల్ మేనేజర్ వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. నారాయణ మెడికల్ కళాశాలలో శనివారం సంచార దంత వైద్య వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దంత సమస్యలను నిర్లక్ష్యం చేయడం వల్ల పంటి సంబంధ వ్యాధులతో పాటు కేన్సర్ వంటి వ్యాధులు కూడా ప్రబలుతున్నాయన్నారు. ప్రాథమిక దశలోనే దంత వ్యాధులను గుర్తించి చికిత్స అందించే లక్ష్యంతో సంచార వాహనాన్ని ప్రారంభించామన్నారు. 10 మంది స్పెషలిస్టు డాక్టర్లు, డెంటల్ చైర్, ఎక్స్‌రే మిషన్‌లు ఉన్నాయన్నారు. ఎక్స్‌రే, కన్సల్టేషన్ వంటి సేవలను ఉచితంగా చేస్తామని, మందులు మాత్రం కొనుగోలు చేయాల్సి ఉందన్నారు. నారాయణ డెంటల్ కళాశాల ప్రిన్సిపల్ అజయ్‌రెజినాల్డ్ మాట్లాడుతూ నెల్లూరు అర్బన్, గ్రామీణ నియోజకవర్గంలోని 180 మున్సిపల్ పాఠశాలల విద్యార్థులకు 'నారాయణ చిన్నారి చిరునవ్వు' అనే పథకం ద్వారా దంత చికిత్సలు, పరీక్షలను ఉచితంగా చేసి మందులు ఇస్తామన్నారు. కార్యక్రమంలో డీన్ శివకుమార్, కో-ఆర్డినేటర్ కేవీ సునీల్‌కుమార్, ఏఓ అరవింద్‌రెడ్డి, ఏజీఎం భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

15న మాల మహా గర్జన

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : ఈనెల 15న అమరావతిలో జరిగే మాల మహాగర్జనను జయప్రదం చేయాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు వెంకటరమణ కోరారు. కొండాయపాళెం గేటు వద్ద ఉన్న అంబేడ్కర్ భవన్‌లో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జేఏసీ ఆధ్వర్యంలో జరిగే మహాగర్జనకు విద్యార్థులు, మేధావులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో కొప్పాల ప్రమీల, జయప్రద, ఉషారాణి, కొత్తకోట కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

'అమ్మ నాన్నలను పూజించండి' నేడు



నెల్లూరు(బృందావనం) : పురమందిరం ప్రాంగణంలోని వర్ధమాన సమాజం హాల్లో ఆదివారం సాయంత్రం కేతా సుబ్బారావు ప్రజావేదిక ఆధ్వర్యంలో 'అమ్మ నాన్నలను పూజించండి' అంశంపై కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు గాయకుడు పాటూరు శ్రీనివాసులు తెలిపారు. అందుకు సంబంధించిన ఆహ్వాన పత్రికలను సుబేదారుపేటలో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పాటూరు శ్రీనివాసులు మాట్లాడుతూ భారతీయ సంప్రదాయంలో తల్లిదండ్రులకు ఉన్న విలువలను వివరిస్తూ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. తొలుత పాటలు, డ్యాన్స్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో నాగినేని ప్రభాకర్, జగన్‌మోహన్, రఘురామిరెడ్డి, ఆనంద్, కేతా సుబ్బారావు పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాల మెరుగే లక్ష్యం



మాట్లాడుతున్న ఎంపీ వేమిరెడ్డి. చిత్రంలో ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి



సుబేదారుపేటలోని బాలికోన్నత పాఠశాలలో అవగాహన కల్పిస్తున్న ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు

నెల్లూరు (టౌన్) : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను మెరుగుపరచడమే లక్ష్యంగా పేరెంట్స్ టీచర్స్ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. స్థానిక బీవీ నగర్‌లోని కేఎన్నార్ మున్సిపల్ హైస్కూల్లో జరిగిన పేరెంట్స్ టీచర్స్ సమావేశానికి ఆయన శనివారం హాజరై, మాట్లాడారు. ఎడ్యుకేట్, ఎంగేజ్, ఎంపవర్ లక్ష్యాలతో తొలిసారిగా రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో మీటింగ్ ఏర్పాటు చేయడం గొప్ప పరిణామమన్నారు. సమావేశంలో రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి, జనసేన జిల్లా నేత నూనె మల్లికార్జునయాదవ్, కార్పొరేటర్ విజయభాస్కర్‌రెడ్డి, ఏపీసీ ఉషారాణి, హెచ్ఎం విజయప్రకాష్ పాల్గొన్నారు.

- పేరెంట్స్ సపోర్టు లేకుండా ఏ పాఠశాల అభివృద్ధి జరగదని కలెక్టర్ ఆనంద్ అన్నారు. స్థానిక దర్గామిట్టలోని జెడ్పీ బాలుర, బాలికల హైస్కూల్స్‌లో జరిగిన పేరెంట్స్ టీచర్స్ సమావేశంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రతిరోజు గమనిస్తూ ఉండాలన్నారు. సమావేశంలో డీఈఓ బాలాజీరావు, ఏఎంఓ సుధీర్‌బాబు, హెచ్ఎం కృష్ణారెడ్డి పాల్గొన్నారు.
- ప్రభుత్వ సహకారం ఉంటే విద్యార్థులు అద్భుతాలు సాధిస్తారని రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. స్థానిక నవాబుపేటలోని బీవీఎస్ బాలికల హైస్కూల్‌లో జరిగిన పేరెంట్స్ టీచర్స్ మీటింగ్‌కు ఆయన పాల్గొని, మాట్లాడారు. ఇంత పెద్ద ఎత్తున పేరెంట్స్, టీచర్స్‌ల సమావేశం నిర్వహించడం గొప్ప విషయమన్నారు. తొలుత భూటాన్ సౌత్ ఏషియన్ గేమ్స్‌లో ఆటియా పాటియాలో విజేతగా నిలిచి అవార్డు పొందిన విద్యార్థిని పూజితను సత్కరించారు.
- **నెల్లూరు(వీఆర్సీసెంటర్) :** వెంకటేశ్వరపురంలోని మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్లో జరిగిన సమావేశంలో ఎస్ఎంసీ చైర్మన్ ఖలీల్, కార్పొరేటర్ దేవరకొండ సుజాత, హెచ్ఎం మంజులవాణి, నగరపాలక సంస్థ ఇంజినీర్ అంజిరెడ్డి పాల్గొన్నారు.
- స్థానిక డీకేడబ్ల్యూ జూనియర్ కళాశాలలో జరిగిన సమావేశంలో ఆర్ఐఓ శ్రీనివాసులు, ఇన్‌చార్జి ప్రిన్సిపల్ కొండయ్య, అధ్యాపకులు వెంకటేశ్వర్లు, చంద్రకళ, సమత, కృష్ణవేణి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు కరుణకుమారి, ప్రసన్న, భారతి పాల్గొన్నారు.
- కొండాయపాళెం మున్సిపల్ స్కూల్‌లో పూర్వ విద్యార్థులను సన్మానించారు. తల్లిదండ్రులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. హెచ్ఎం భాస్కరరావు, ఎస్ఎంసీ చైర్మన్ శిరీషా, దాతలు ప్రభాకర్, నగేష్‌రెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.
- క్రాంతినగర్ మున్సిపల్ ప్రాథమికోన్నత పాఠశాలలో విశ్రాంత సోషల్ వెల్ఫేర్ అధికారి ఖాసీమ్ సీలింగ్ ఫ్యాన్లు అందజేశారు. విశ్రాంత తహసీల్దార్ జనార్దనరావు, జేఏసీ కోశాధికారి రత్నయ్య, ఎస్పైబ్రహ్మమ్మ, హెచ్ఎం కృష్ణయ్య పాల్గొన్నారు.
- గాంధీనగర్ మున్సిపల్ పాఠశాలలో జరిగిన సమావేశంలో కార్పొరేటర్ సత్తార్, ఎస్ఎంసీ చైర్మన్ సజ్జా, వైస్ చైర్మన్ హైమావతి, గ్రామ మహిళా పోలీస్ నాగలక్ష్మి, హెచ్ఎం ఖాజా పాల్గొన్నారు.
- మూలాపేటలోని రామయ్య బడిలో జరిగిన కార్యక్రమంలో కార్పొరేటర్ శాంతి, హెచ్ఎం వేదమూర్తి, హెచ్ఎం కుమారి పాల్గొన్నారు.

హెల్త్ కార్డుల పంపిణీ

నెల్లూరు(అర్బన్) : కొత్తూరు జెడ్పీ హైస్కూల్లోని 130 మంది విద్యార్థులకు డీఎంహెచ్ఓ డాక్టర్ పెంచలయ్య చేతుల మీదుగా హెల్త్ కార్డులను శనివారం పంపిణీ చేశారు. అక్కడ జరిగిన పేరెంట్స్-టీచర్స్ మీటింగ్‌లో ఆయన పాల్గొని, వీటిని అందజేశారు. అనంతరం మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి వ్యక్తిగత పరిశుభ్రత ఎంతో ముఖ్యమన్నారు. అనంతరం డీఎంహెచ్ఓను విద్యార్థులు, తల్లిదండ్రులు సన్మానించారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

నెల్లూరు(క్రైమ్) : మత్తు, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని నగర డీఎస్పీ డి.శ్రీనివాసరెడ్డి సూచించారు. నగరంలోని వివిధ పాఠశాలల్లో జరిగిన టీచర్స్ పేరెంట్స్ మీటింగ్‌లో శనివారం పోలీసు అధికారులు పాల్గొన్నారు. 'డ్రగ్స్ వద్దు బ్రో' అంటూ అవగాహన కల్పించారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ చదువుపై దృష్టిసారించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమాల్లో నగర ఇన్‌స్పెక్టర్‌లు చిట్టెం కోటేశ్వరరావు, అన్వర్‌బాషా, మద్ది శ్రీనివాసరావు, రోశయ్య, కిశోర్‌కుమార్, సాంబశివరావు పాల్గొన్నారు.

ఉద్యోగుల తొలగింపు దారుణం



మాట్లాడుతున్న ఏపీజీఈఏ నాయకులు

నెల్లూరు(అర్బన్) : అధికారులు అత్యుత్సాహంతో కోర్టు తీర్పునకు విరుద్ధంగా వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న హెల్త్ అసిస్టెంట్లను తొలగించారని ఏపీజీఈఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వై.రమణారెడ్డి అన్నారు. నగరంలోని ఆ సంఘ కార్యాలయంలో జరిగిన అత్యవసర సమావేశంలో రమణారెడ్డి శనివారం మాట్లాడారు. కోర్టు తీర్పుకు విరుద్ధంగా తగిన గడువు ఇవ్వకుండా ముందుగానే రాష్ట్ర వ్యాప్తంగా 1600 మందికి పైగా హెల్త్ అసిస్టెంట్లను తొలగించడం దారుణమన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కూడా మూడు నెలలు ముందు నోటీసులు ఇచ్చి, మూడు నెలల జీతాలు ఇచ్చి తొలగించాల్సి ఉందన్నారు. ఇకనైనా కోర్టు తీర్పునకు లోబడి లోపాలను సరిచేసుకోవాలన్నారు. సమావేశంలో సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సుధాకర్‌రెడ్డి, పీఏఎస్‌టీ రామ్‌ప్రసాద్, సిటీ అధ్యక్షుడు కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

10న డయల్ యువర్ డీఎం

నెల్లూరు సిటీ : ఈనెల 10న మంగళవారం సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం జరుగుతుంది. డిపో పరిధిలోని ప్రయాణికులు 99592 25641 నంబర్‌కు ఫోన్ చేసి సమస్యలు తెలియజేయవచ్చని అధికారులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

నారాయణలో ఫ్యాకల్టీ ప్రోగ్రామ్



నెల్లూరు (టౌన్) : స్థానిక నారాయణ ఇంజినీరింగ్ కళాశాలలో మెకానికల్ విభాగం ఆధ్వర్యంలో ఇండస్ట్రీ 4.ఓ అంశంపై ఫ్యాకల్టీ ప్రోగ్రామ్‌ను శనివారం నిర్వహించారు. తిరుపతి ఐఐటీ ప్రొఫెసర్లు త్యాగరాజన్, గోవిందు సాహు రిసోర్స్ పర్సన్‌లుగా వ్యవహరించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆయా ఇంజినీరింగ్ కళాశాలల నుంచి వచ్చిన అధ్యాపకులకు అప్లికేషన్లు, డ్రోన్లు, ఇండస్ట్రీ 4.ఓ టెక్నాలజీ, సెన్సార్స్, మెడికల్ అప్లికేషన్స్, 3డీ ప్రింటింగ్, తయారీ టెక్నాలజీ వంటి అంశాల గురించి వివరించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ దత్తాత్రేయశర్మ, ప్రోగ్రామ్ కన్వీనర్ ఏవీఎస్ శ్రీధర్, ప్రిన్సిపల్ శ్రీనివాసులురెడ్డి, కో-ఆర్డినేటర్ బీవీఆర్ఎం కుమార్ పాల్గొన్నారు.

వైద్య ఉద్యోగులకు దంత పరీక్షలు



దంత వైద్యపరీక్షలు చేయించుకుంటున్న డీఎంహెచ్ఓ

నెల్లూరు(అర్బన్) : డాక్టర్ కొండారెడ్డి డెంటల్ స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో నగరంలోని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో అధికారులకు, ఉద్యోగులకు ఉచిత దంత వైద్య పరీక్షలు నిర్వహించారు. డీఎంహెచ్ఓ డాక్టర్ పెంచలయ్య, అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ ఖాదర్‌వలీ తదితరులతో పాటు పలు సెక్షన్‌లకు చెందిన అధికారులు, ఉద్యోగులు దంత పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్ మనోజ్‌రెడ్డి, డాక్టర్ మురళి, డాక్టర్ మమత, పీఆర్వో రాజశేఖర్ పాల్గొన్నారు.